RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in  rajadhanivoicedaily@gmail.com




సంపుటి : 02 | సంచిక : 303 | 24 గురువారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-



## - ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నూతన క్యాంపస్‌కు చంద్రబాబు శంకుస్థాపన

**తుళ్లూరు, సెప్టెంబర్ 23 రాజధాని వాయిస్ : :** అమరావతిని పంచ సూత్రాల ఆధారంగా ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నూతన క్యాంపస్‌కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అమరావతి భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.నో పోల్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ అనే ఐదు సూత్రాలతో రాజధాని నిర్మాణం జరుగుతోందన్నారు. విద్యుత్, టెలిఫోన్ తీగలను భూగర్భంలో ఏర్పాటు చేసి నో పోల్ సిటీగా, కృష్ణానది, కాలువలతో బ్లూ సిటీగా, 50 శాతానికి పైగా పచ్చదనంతో గ్రీన్ సిటీగా అమరావతిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. పునరుత్పాదక ఇంధనంతో నెట్-జీరో కార్బన్ నగరంగా, క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి సాంకేతికతలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని వివరించారు.ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ అమరావతికి రావడం గర్వకారణమని చంద్రబాబు అన్నారు. ఈ కేంద్రం ప్రపంచంలోనే అత్యుత్తమ కంటి వైద్య సంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. చికిత్సతో పాటు పరిశోధన, విద్య, శిక్షణ, పునరావాసం, కమ్యూనిటీ ఐ హెల్త్ సేవలను అందించేలా కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.అమరావతిని నాలెడ్జ్ ఎకానమీ, హెల్త్‌కేర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. క్వాంటం టెక్నాలజీ, స్పేస్, డ్రోన్, సెమీకండక్టర్ రంగాల్లో పెట్టుబడులు, సంస్థలను ఆకర్షిస్తున్నామని చెప్పారు. ఎయిమ్స్, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి, కిమ్స్, ఎల్వీ ప్రసాద్ వంటి సంస్థలతో అమరావతి వైద్యరంగంలో కీలక కేంద్రంగా మారుతుందన్నారు.రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులు చేసిన త్యాగం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రపంచ స్థాయిలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్వీ ప్రసాద్ సంస్థ నూతన కేంద్రాన్ని 2027 డిసెంబర్ 27 నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# కూటమి క్లీన్ స్వీప్ చేయాలి

### మంత్రుల భేటీలో నారా లోకేశ్



**అమరావతి, సెప్టెంబర్ 23 రాజధాని వాయిస్ : :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో పలువురు మంత్రులతో నిర్వహించిన ప్రత్యేక బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని... ఎన్నికలు జరగవనే ఎలాంటి అపోహలు ఎవరికీ వద్దని ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు ఆయన స్పష్టతనిచ్చారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాల ను కూడా వేగంగా పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక పోరులో కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు సన్నద్ధం కావాలని, సీట్ల అంశంపై కూటమి సమన్వయ కమిటీ, అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటాయని వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా ఆధారాలతో బయటకు వస్తుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'గొడ్డలి పార్టీ' నిరుద్యోగులకు ఎంతో మేలు చేసిన మెగా డీఎస్సీపై నిందలు వేస్తోందని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటా ఉపాధ్యాయులపై గూండా లతో దాడులు చేయించి మీసాలు మెలేసిన వారు, పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేయగానే పరారయ్యారని ఎద్దేవా చేశారు. గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటం శుభపరిణామమని వ్యాఖ్యానించిన మంత్రి లోకేశ్... వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు. జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుకోవడానికి ఈ వర్షాలు ఎంతో అనుకూలిస్తాయని పేర్కొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై గవర్నర్‌కు జగన్ ఫిర్యాదు



**విజయవాడ, రాజధాని వాయిస్ :** డీఎస్సీ–2025 నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని కోరినట్లు వెల్లడించారు. అలాగే శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడికి సంబంధించిన ఆధారాలను కూడా గవర్నర్‌కు సమర్పించినట్లు తెలిపారు.డీఎస్సీ నియామకా ల్లో జరిగినట్లు తాము పేర్కొంటున్న అక్రమాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని జగన్ చెప్పారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్ష నిర్వహణ వంటి కీలక బాధ్యతలను ఒకే అధికారికి అప్పగించడం ద్వారా వ్యవస్థలో లోపాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని, కొన్ని నియామకాల విషయంలో అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటిపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు. క్రీడా కోటా నియామకాల విషయంలో కూడా అనేక సందేహాలు ఉన్నాయని జగన్ ఆరోపించారు. నియామకాల కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు, వాటి అమలు విధానం, ఉద్యోగాల కేటాయింపులపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కొన్ని క్రీడా ధ్రువపత్రాల ప్రామాణికతపై కూడా అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ సంబంధిత అంశాలను గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు.శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనపై కూడా జగన్ స్పందించారు. శాంతియుత నిరసన కార్యక్రమానికి ముందస్తు సమాచారం ఇచ్చినా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగాయని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, ఇతర ఆధారాలను గవర్నర్‌కు అందజేసినట్లు తెలిపారు. తమ పార్టీ నాయకులపై హత్యాయత్నం, ఇతర కేసులు నమోదు చేయడాన్ని కూడా ఆయన విమర్శించారు.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని జగన్ పేర్కొన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో పారదర్శకత అవసరమని, డీఎస్సీ నియామకాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి సీబీఐ దర్యాప్తు అవసరమని పునరుద్ఘాటించారు. విద్యాశాఖ మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేశారు. అయితే జగన్ చేసిన ఆరోపణలు, డిమాండ్లు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు అధికారికంగా చేసిన స్పందనలు వేర్వేరుగా ఉండవచ్చని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. డీఎస్సీ వ్యవహారం, శాప్ కార్యాలయం ఘటన, ఇతర ఆరోపణలపై భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

# రాహుల్ హెచ్చరికతో ముదురుతున్న సర్ వివాదం

- ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల సంఘానికి తీవ్ర హెచ్చరిక
- 'ఓటు చోరీ' ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వ్యాఖ్య
- కమిషనర్ల భిన్నాభిప్రాయాలపై కథనం కలకలం
- సర్ ప్రక్రియ నిలిపివేయాలని కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 :రాజధాని వాయిస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగు తున్న సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబి తా నిర్వహణలో జరుగుతున్న పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఎన్నికల అధికారులకు కఠిన హెచ్చరిక జారీ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలక మని, దానికి భంగం కలిగించే చర్యలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో చేసిన పోస్టులో 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేసినట్టేనని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించిన ఒక వీడియోను కూడా పంచుకున్నారు. అందులో ఎన్నికల సంఘం అధికారులు తీసుకుంటున్న చర్యలు తప్పని ఆరోపిస్తూ, భవిష్యత్తులో ఈ అంశంపై పూర్తి బాధ్యత నిర్ధారిస్తామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.ఈ వివాదానికి కారణంగా ఒక జాతీయ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనం నిలిచింది. గత పది నెలల కాలంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం పద్నాలుగు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం వెల్లడించింది. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమ య్యాయని అందులో ప్రస్తావించబడింది. అయితే ఈ కథనంలోని ఆరోపణలను ఎన్నికల సంఘం తిరస్కరించింది. కమిషనర్లు కొన్ని అంశాలపై సూచనలు, అభిప్రాయాలు తెలియజేసినా అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయాలు నమోదు కాలేదని స్పష్టం చేసింది. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంతో పాటు ఇతర నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నట్లు వెల్లడించింది.ఎన్నికల సంఘం వివరణతో వివాదం మరింత రాజకీయ రంగు పులుముకుంది. ఒకవైపు ప్రతిపక్షాలు ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తుండగా, మరోవైపు ఎన్నికల సంఘం అన్ని చర్యలు నిబంధనలకు అనుగుణంగానే కొనసాగుతున్నాయని చెబుతోంది. దీంతో ఓటర్ల జాబితా సవరణ అంశం జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చాంశంగా మారింది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ అంశంపై స్పందించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న ప్రధాన నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీతో సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి పూర్తి పారదర్శకతతో సమీక్ష చేపట్టాలని కోరారు.

# నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లకు ఆమోదం

- కేబినెట్‌లో 60కిపైగా కీలక నిర్ణయాలు
- అమరావతి అభివృద్ధికి వేల కోట్ల నిధులు
- పారిశ్రామిక పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్
- విద్యుత్, ఐటీ, పర్యాటక రంగాలకు ప్రోత్సాహం



**అమరావతి, రాజధాని వాయిస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగి న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా ఈ కమిషనరేట్లు ఏర్పాటు కానున్నాయి. సమావేశంలో 60కి పైగా అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.రాజధాని అమరావతి అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అమరావతి పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రూ.1,548.98 కోట్ల పరిపాల నా అనుమతిని మంజూరు చేసింది. అదనంగా నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, వర్షపు నీటి కాలువలు, రహదారులు, వీధి దీపాల పనుల కోసం రూ.644.98 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. అసెంబ్లీ భవన నిర్మాణంలో భాగంగా స్పైర్, రూఫ్, లిఫ్టుల నిర్మాణానికి రూ.661 కోట్ల నిధులకు కూడా అనుమతి ఇచ్చింది. ల్యాండ్ పూలింగ్ పథకంలో భూములు ఇచ్చిన రైతులకు సంబంధించిన నిబంధనల్లో మార్పులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన అర్హులైన రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే 1,304 మంది రైతులకు చెల్లించిన యాన్యుటీ మొత్తాన్ని కూడా ఆమోదించింది.పారిశ్రామిక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా పలు ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు మంజూరు చేసింది. మై హోమ్ ఇండస్ట్రీస్ గ్రీన్‌ఫీల్డ్ సిమెంట్ యూనిట్, క్యాటర్‌పిల్లర్ ఇండియా ప్రాజెక్టు, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ విస్తరణ కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చింది. కుప్పం పరిధిలో పలు పరిశ్రమలకు భూకేటాయింపులకు కూడా ఆమోదం తెలిపింది. ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ రంగంలో సోలార్, విండ్, హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టులతో పాటు 1,344 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, 500 మెగావాట్ల శక్తి నిల్వ సామర్థ్యాల ఏర్పాటు కు అనుమతులు మంజూరు చేసింది. పర్యాటక రంగంలో అమరావతి, కడప, రేణిగుంట ప్రాంతాల్లో హోటల్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయి ంచిం ది. ఆహార ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, స్టీల్, సిమెంట్, పారిశ్రామిక పార్కులకు సంబ ంధించిన ప్రతిపాదనలకు కూడా ఆమోదం తెలిపింది. అదనంగా న్యాయాధికా రుల పదవీ విరమణ వయస్సును 61 నుంచి 62 ఏళ్లకు పెంచడం, సామాజిక మాధ్యమ ప్రభావశీలుల విధానం, ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఎక్సైజ్ విధానం, వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతి అవకాశాల కల్పన వంటి అంశా లపై కూడా కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల విస్తరణకు ఈ నిర్ణయాలు దోహదపడనున్నాయని ప్రభుత్వం పేర్కొంది

# అగ్రిగోల్డ్ బాధితులకు తొలి విడతలో న్యాయం



**అమరావతి, రాజధాని వాయిస్ :** అగ్రిగోల్డ్‌లో పూర్తి మొత్తాన్ని చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న 35,544 మంది బోనాఫైడ్ లబ్ధిదారులకు తొలి విడతలో న్యాయం చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అగ్రిగోల్డ్ బాండ్ల జిరాక్స్ కాపీల సేకరణకు 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తాయన్నారు. 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పూర్తి డబ్బు చెల్లించినా రిజిస్ట్రేషన్ కాని 6,989 మందికి రెండో విడతలో న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

# బాల్ బ్యాడ్మింటన్ రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయికుమార్

### మంత్రి సవిత అభినందనలు



**తాడేపల్లి/అమరావతి రాజధాని వాయిస్ :** ఈ నెల 9-13 తేదీల్లో మర్కాపు రంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... ఏపీ నుంచి జాతీయ పోటీలకు ఎంపికైన వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి దేవళ్ల సాయికుమార్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వినుకొండ ఎంజేపీ బీసీ గురుకు ల విద్యార్థి, బ్యాడ్మింటెన్ క్రీడాకారుడు సాయికుమార్, కోచ్ జూనా నాయక్, ప్రిన్సిపాల్ వై.రమేశ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 9-13 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... జాతీయ పోటీలకు ఎంపికైనట్లు మంత్రి సవితకు సాయికుమార్ తెలిపాడు. వచ్చే నెల మూడో తేదీ నుంచి చత్తీస్ ఘడ్ లో జరిగే జాతీయ సబ్ జూనియర్స్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొనబోతున్నట్లు వివరించాడు. బాల్ బ్యాడ్మింటన్ లో రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయికుమార్ ను మంత్రి సవిత కొత్త దుస్తులు అందజేసి, అభినందించి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించింది... రాష్ట్రానికి, దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో సాయికుమార్ కు మెళకువలు నేర్పిన కోచ్ జూనా నాయక్ ను, ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.రమేశ్ ను కూడా మంత్రి సవిత అభినందించారు.

# జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బొత్స అనూష



**తాడేపల్లి రాజధాని వాయిస్ :**వైసీపీ అధినేత జగన్‌ను భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ నూతన సమన్వయకర్త బొత్స అనూష మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి లోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె జగన్‌తో సమావేశమ య్యారు. ఇటీవలే భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయ ణ కుమార్తె అనూషను పార్టీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. గతంలో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీని వీడటంతో, స్థానిక క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి పార్టీని బలోపేతం చేసే బాధ్యతను జగన్ ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో కీలక బాధ్యతను కట్టబెట్టినందుకు పార్టీ అధినేత జగన్‌కు అనూష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.భేటీ అనంతరం అనూష మాట్లాడుతూ... నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి, శ్రేణులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు.

## రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు: చంద్రబాబు

**అమరావతి రాజధాని వాయిస్ ::** స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్ఈసీ ఎప్పు డు షెడ్యూల్ ప్రకటించినా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమ ంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వ యం, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఇన్‌ఛార్జ్ మంత్రు లకు సూచించారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని వచ్చే బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రులకు ఎలక్షన్ టార్గెట్ నుంచి లా అండ్ ఆర్డర్ వరకు అన్ని అంశాలపై దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై రైల్వే యాక్ట్ తరహాలో కఠిన చట్టం తీసుకురా వాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయ కుల ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసా నికి పాల్పడుతున్నా యని, వైకాపా రౌడీ మూకలు అలజడి సృష్టించే ందుకు ప్రయత్ని స్తున్నాయని ధ్వజమెత్తారు. జగన్ బెంగళూరులో కూర్చుని రౌడీ గ్యాంగ్ ద్వారా ఏపీలో అరాచకాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్‌ను దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నా న్నీ ఉపేక్షించబో మని స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటన.. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడిన తీరు బట్టబయలైందని చంద్రబాబు అన్నారు. శాప్ కార్యాలయం, టీడీపీ కేంద్ర కార్యాల యం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడుల్లో ఒకే వ్యక్తులు ఉన్నారన్న అంశాన్ని ప్రస్తావించారు. వైసీపీ నేతలు జరగ ని విషయాలను జరిగినట్లుగా ప్రచారం చేయడంలో సిద్ధహస్తులని ఆరోపిస్తూ, ఉద్దేశపూర్వకంగా బురద చల్లే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

# సాయికృష్ణ మృతి కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు.. హైకోర్టు విచారణపై స్టే

**విజయవాడ, రాజధాని వాయిస్ :** గాదె సాయికృష్ణ మృతి కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలీసుల కస్టడీలో ఉన్న వ్యక్తి ఆచూకీ లేకుండా పోవడం చట్టవిరుద్ధమేనని స్పష్టం చేసింది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చేపడుతున్న విచారణపై స్టే విధించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సెప్టెంబరు 30లోగా సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించింది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసిన ధర్మాసనం.. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబరు 12కు వాయిదా వేసింది.సాయికృష్ణ కస్టడీలో ఉన్న సమయంలో ఏం జరిగిందన్న దానిపై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సేకరించిన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ సీసీటీవీ రికార్డుల్లో కీలక సమయానికి సంబంధించిన ఫుటేజీ అందుబాటులో లేదని గతంలో కోర్టు రికార్డుల్లో నమోదైంది. ప్రస్తుతం కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నుంచి పూర్తి వివరాలను సుప్రీంకోర్టు కోరింది.

**కేసు పూర్వాపరాలు**

గాదె సాయికృష్ణను 2026 మే 6న మార్కాపురం నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విజయవాడలోని కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు దర్యాప్తు రికార్డుల్లో ఉంది.

**కస్టడీలో వ్యక్తి మాయం కావడం చట్టవిరుద్ధమన్న కోర్టు**
**సెప్టెంబరు 30లోగా పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశం**
**సీల్డ్ కవర్‌లో వివరాలు ఇవ్వాలని ఆదేశం**
**హైకోర్టు పిటిషన్లన్నీ బదిలీ చేయాలని ఆదేశాలు**
**అక్టోబరు 12న తదుపరి విచారణ**

అనంతరం అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచలేదని, ఆ తర్వాత అతడి ఆచూకీ తెలియలేదని ప్రాసిక్యూషన్ పేర్కొంది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసి మృతిచెందేలా చేశారని, మృతదేహాన్ని కూడా మాయం చేశారని ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. జూన్ 19న కేసు నమోదు కాగా, జూన్ 21న రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి కృష్ణలంక సీఐ ఎస్ఎస్‌వీవీ నాగరాజును సిట్ అరెస్టు చేసింది. ఆయనపై సాయికృష్ణ కస్టడీ మృతి కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఉన్నాయి. అయితే కేసులోని ఆరోపణలు, దర్యాప్తులో తేలాల్సిన అంశాలపై తుది నిర్ణయం ఇంకా రావాల్సి ఉంది.తాజాగా సెప్టెంబరు 21న సిట్ విజయవాడ ఏసీబీ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అందులో సాయికృష్ణను కస్టడీలో కొట్టినట్లు, అనంతరం రాణిగారితోటలోని ఓ



ప్రైవేటు భవనానికి తరలించగా అక్కడ అతడు కుప్పకూలి మృతి చెందినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొంది. నిందితుల్లో ఒకరైన జి. సురేశ్ సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలంలో సాయికృష్ణను పోలీసులు కొడుతుండగా తాను చూశానని, అనంతరం అతడు కుప్పకూలి చనిపోయినట్లు తెలిపినట్లు నివేదికలు వెల్లడించాయి. మృతదేహాన్ని ఆధారాలు లేకుండా చేసేందుకు దహనం చేసినట్లు కూడా సిట్ ఆరోపించినట్లు సమాచారం. ఈ కేసులో అప్పటి కృష్ణలంక సీఐ ఎస్ఎస్‌వీవీ నాగరాజుతో పాటు మరో ఆరుగురిని నిందితులుగా చేర్చారు.

# ‘ఐదేళ్ల బీటెక్’ను పరిశీలించాలి

### విద్యార్థుల అభ్యాస వేగానికి అనుగుణంగా సౌకర్యవంతమైన విధానం అవసరం: ప్రొఫెసర్ రామ్‌గోపాల్‌రావు



**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ :** ఇటీవల బాంబే ఐఐటీలో విద్యార్థి ఆత్మహత్య ఘటన నేపథ్యంలో ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్, బిట్స్ పిలానీ క్యాంపసెస్ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.రామ్‌గోపాల్‌రావు కీలక ప్రతిపాదన చేశారు. విద్యార్థుల భిన్న నేపథ్యాలు, అభ్యాస వేగాన్ని దృష్టిలో ఉంచుకుని ఐఐటీల్లో ప్రస్తుతం ఉన్న నాలుగేళ్ల బీటెక్ కోర్సును ఐదేళ్లకు విస్తరించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఐఐటీల్లో విద్యా ప్రమాణాలను తగ్గించకుండా, విద్యార్థులకు వారి సామర్థ్యానికి అనుగుణంగా అదనపు సమయం, అకడమిక్ సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వివిధ ర్యాంకులు, విభిన్న విద్యా నేపథ్యాలతో వచ్చిన విద్యార్థులందరికీ ఒకే విధమైన బోధన పద్ధతిని అనుసరించడం వల్ల కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**అందరికీ ఒకే వేగం సాధ్యం కాదు**

చాలామంది విద్యార్థులు కోచింగ్ ఆధారిత విద్యా విధానం నుంచి ఐఐటీల్లోకి వస్తున్నారని రామ్‌గోపాల్‌రావు తెలిపారు. కోచింగ్ నుంచి స్వతంత్రంగా నేర్చుకునే విధానానికి మారడం కొందరికి సవాలుగా ఉంటుందని చెప్పారు. నెమ్మదిగా బోధిస్తే కొందరు ఆసక్తి కోల్పోతారని, వేగంగా బోధిస్తే మరికొందరు వెనుకబడే అవకాశం ఉందన్నారు.

ఈ నేపథ్యంలో ఐదేళ్ల బీటెక్ విధానాన్ని ప్రవేశపెడితే విద్యార్థులకు మరింత వెసులుబాటు కలుగుతుందని వివరించారు. నిర్దేశిత క్రెడిట్లు సాధించిన వారు నాలుగేళ్లు లేదా అవసరమైతే అంతకంటే తక్కువ వ్యవధిలోనే కోర్సు పూర్తి చేసుకునే అవకాశం ఉండవచ్చన్నారు. అదనపు సమయం అవసరమైన విద్యార్థులు ఐదో సంవత్సరానికి కోర్సును విస్తరించుకోవచ్చని తెలిపారు. వారికి రికార్డు చేసిన లెక్చర్లు, ఆన్‌లైన్ మెటీరియల్, ఇతర అకడమిక్ సహాయాన్ని అందించాలని సూచించారు. ఐదో సంవత్సరం చదువుతున్నారనే కారణంతో విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించే పరిస్థితి లేకుండా విధానాన్ని రూపొందించవచ్చన్నారు.

ఇదే సమయంలో బాంబే ఐఐటీ ఘటన నేపథ్యంలో ప్రొఫెసర్ డి.సూర్యనారాయణపై జరుగుతున్న ప్రచారంపై రామ్‌గోపాల్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని, వ్యక్తులపై బహిరంగ ప్రచారం చేయడం సముచితం కాదని పేర్కొన్నారు.

# పార్టీ శ్రేణులకు జగన్ దిశానిర్దేశం

**– కూటమి ప్రభుత్వంపై విమర్శల వెల్లువ – భూకేటాయింపులపై ప్రశ్నల వర్షం**
**– ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి**



**తాడేపల్లి,రాజధాని వాయిస్ :సెప్టెంబర్ 23 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, స్థానిక సమస్య లు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నేతలతో చర్చించారు. పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై మరింత చురుకుగా పనిచేయాలని ఆయన సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై జగన్ విమర్శలు చేశారు. భూకేటాయింపుల విషయంలో పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ విలువైన భూములను తక్కువ ధరలకు కేటాయిస్తున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని విద్యాసంస్థలు, సంస్థలకు భూముల కేటాయింపులపై ప్రజల్లో చర్చ జరుగ ుతోందని, ఈ అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు.రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం, మద్యం విక్రయాల పరిస్థితిపై కూడా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల లభ్యత పెరుగుతోందని ఆరోపిస్తూ ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సామాజిక సమస్యలపై పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై పనిచేయాలని కోరారు. విశాఖపట్నం నగర పాలన, మున్సిపల్ వ్యవహారాలపై కూడా ఆయన స్పందించారు. స్థానిక సంస్థల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారంపై పార్టీ నేతలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలు, భూములకు సంబంధించిన అంశాలపై ప్రజల తరఫున పోరాడాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షం పాత్ర కీలకమని జగన్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జగన్ భరోసా ఇచ్చారు. ప్రజల మద్దతుతోనే రాజకీయ వ్యవస్థ ముందుకు సాగుతుందని, చివరికి ప్రజల తీర్పే నిర్ణయాత్మకమ వుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నం సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై పార్టీ పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు.

# పశ్చిమ బెంగాల్‌లో ముదిరిన వివాదం

**కోల్‌కతా, సెప్టెంబర్ 23 :** పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది. ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై ఎన్నికల సంఘం కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయన్న వార్తలు వెలుగులోకి రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చలు వేడెక్కాయి. ఈ నేపథ్యంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్ర ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ వివాదంపై స్పందించిన మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాత ఓటర్ల జాబితాతోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు తలెత్తకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కూడా ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసనలు చేపడతామని ప్రకటించారు.తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో లక్షలాది మంది ఓటర్ల పేర్లు ఉద్దేశపూర్వకంగా తొలగించబడ్డాయని ఆయన ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంటూ ఎన్నికల సంఘం నిర్ణయాలపై న్యాయపరమైన పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ అంశంపై ఎన్నికల సంఘం స్పష్టీకరణ ఇచ్చింది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియతో పాటు అన్ని ప్రధాన నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నట్లు వెల్లడించింది. చర్చల సమయంలో అధికారులు, కమిషనర్లు సూచనలు ఇవ్వడం సహజ పరిపాలనా విధానంలో భాగమేనని స్పష్టం చేసింది. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయాలు నమోదు కాలేదని పేర్కొంది.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన అంశమని ఎన్నికల సంఘం వివరించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అర్హత లేని పేర్లను గుర్తించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపింది. రాజకీయ పార్టీల నుంచి వచ్చే అభ్యంతరాలు, సూచనలను కూడా పరిశీలిస్తున్నామని పేర్కొంది. ఈ వ్యవహారం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా



మారింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతుండగా, ఎన్నికల సంఘం మాత్రం తన చర్యలు నిబంధనలకు అనుగుణంగానే కొనసాగుతున్నాయని చెబుతోంది. రానున్న రోజుల్లో ఈ అంశం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.



**ముంబై, రాజధాని వాయిస్ :** పరారీలో ఉన్న ప్రముఖ మద్యం వ్యాపారవేత్త విజయ్ మాల్యాకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కోర్టులో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడంపై న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. న్యాయ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో కోర్టు పత్రాలను బహిరంగ వేదికల్లో పంచుకోవడం సరైన విధానం కాదని స్పష్టం చేసింది. విజయ్ మాల్యాకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై విచారణ చేపట్టిన సందర్భంగా ఈ అంశం న్యాయస్థానం దృష్టికి వచ్చింది. కేసు విచారణ కొనసాగుతున్న సమయంలో పత్రాలు, వివరాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి రావడం న్యాయపరమైన ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. విచారణ పూర్తికాకముందే వివిధ వేదికల్లో చర్చలు జరగడం తగదని పేర్కొంది.న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కోర్టు వ్యాఖ్యానించింది. కోర్టులో సమర్పించిన పత్రాలు, విచారణకు సంబంధించిన వివరాలు అనధికారికంగా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల విస్తరణ నేపథ్యంలో బాధ్యతాయుత వ్యవహారం అవసరమని సూచించింది. కోర్టు ఆదేశాలు, విచారణ పత్రాలు ప్రజా చర్చకు వస్తే కేసు స్వరూపం మారే అవకాశం ఉంటుందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అందువల్ల విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత వ్యక్తులు న్యాయపరమైన పరిమితులను గౌరవించాలని హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయస్థాన అనుమతి లేకుండా సున్నితమైన పత్రాలను పంచుకోవడం సరైంది కాదని తెలిపింది.విజయ్ మాల్యాపై దేశంలోని పలు ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే ఆయనకు సంబంధించిన వివిధ కేసులు భారత న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థల పరిధిలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యాయ ప్రక్రియకు భంగం కలగకుండా వ్యవహరించాలని కోర్టు సూచించింది. కేసు విచారణ కొనసాగుతున్నందున న్యాయపరమైన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని బాంబే హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది.

## వర్షాల నేపథ్యంలో జీఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి




**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో, అలాగే వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల ప్రకారం జిఎంసి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న కమిషనర్ లోతట్టు ప్రాంతాలు, 3 వంతెనలు, కంకరగుంట ఆర్యూబీ దగ్గర నీటిని బెయిల్ అవుట్ చేయడానికి అధికారులు ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశం. వర్షాల నేపథ్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు, టిపిబిఓలు అప్రమత్తంగా ఉండి, క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలి.టౌన్ ప్లానింగ్ విభాగ సిబ్బంది తప్పనిసరిగా ఫీల్డ్‌లో ఉండి, ఎక్కడైనా హోర్డింగులు పడిపోయినట్లయితే వెంటనే పరిశీలించి, తొలగింపు చర్యలు చేపట్టాలి.ఎక్కడైనా చెట్లు పడిపోయినట్లయితే వాటిని వెంటనే తొలగించేలా ఏడిహెచ్ చర్యలు తీసుకోవాలి ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు సమన్వయంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెంటనే బెయిల్ అవుట్ కి చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా డొంక రోడ్ 3 వంతెనలు, చుట్టుగుంట మరియు కంకరగుంట RUB ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి సారించాలి.త్రాగునీటి సరఫరాలో సమస్య రాకుండా ముందస్తుగా జనరేటర్లు సిద్ధం చేసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. DYEE\T, EE\T, TPs, ACP\T, DCP మరియు శానిటరీ సూపర్‌వైజర్లు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వర్షాల కారణంగా ఏర్పడే సమస్యలపై వెంటనే స్పందించి, అవసరమైన చర్యలు చేపట్టాలి.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు మరియు సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి, ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలి .ప్రజలు కూడా తుఫాన్ ప్రభావం తగ్గే వరకు త్రాగునీటిని కాచి చల్లార్చుకొని త్రాగాలని సూచించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**గుంటూరు, రాజధాని వాయిస్** అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి.యం .సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సమాచారాన్ని తెలుసుకోవచ్చని, ప్రజలు కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పాటు అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, రాజధాని వాయిస్:** స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని, అరాచకం సృష్టించి లబ్దిపొందాలని చూస్తున్న వైసీపీ ఆటలు సాగవమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ క్యాలెండర్ సమావేశంలో భాగంగా డివిజన్ పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ నేతల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. అందిన వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలు అతి త్వరలో జరగనున్న నేపథ్యంలో బూత్ స్థాయి నుంచి ప్రతి నాయకుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో అలజడులు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నిస్తున్నప్పటికీ వారి ఆటలు సాగవని అన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ శ్రేణులు ఎన్నికలకు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా విజయవాడలో ఉపాధ్యాయులపై వైసీపీ ప్రభుత్వం చేపట్టిన దమనకాండను ఖండిస్తూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు

# గుంటూరులో ఓటర్ల గుర్తింపు సర్వే ప్రారంభం!

**గుంటూరు, రాజధాని వాయిస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల (G.O.Rt.No. 1165, MA&UD Department) ప్రకారం గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని 76 డివిజన్లలో వార్డుల వారీగా రిజర్వేషన్ల ఖరారు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియ ఈ నెల 23 నుంచి ప్రారంభమైందని, ఈ మొత్తం ప్రక్రియను 23 నుండి అక్టోబరు 1 వరకు అత్యంత పారదర్శకంగా పూర్తి చేయనున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు.బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో వార్డ్ ల రిజర్వేషన్ ఖరారు సర్వే, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, విభాదిపతులతో సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఈ షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబరు 23 నుండి 25 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేకంగా నియమించబడిన సర్వే సిబ్బంది వార్డులు, పోలింగ్ స్టేషన్ల వారీగా ఇంటింటికీ వచ్చి ఓటర్ల జాబితాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తిస్తారని తెలిపారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారంతో రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలను ఫారమ్-1 ద్వారా సెప్టెంబరు 26న నగర పాలక సంస్థ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజల పరిశీలన కోసం ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం, సెప్టెంబరు 27, 28 తేదీల్లో ప్రజల నుండి అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తామని, ఈ క్రమంలో పేర్ల నమోదు లేదా గుర్తింపు కోసం ఫారమ్-2లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల కోసం ఫారమ్-3లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దాఖలైన క్లెయిమ్‌ల వివరాలను ఫారమ్-4 ద్వారా కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించడంతో పాటు, అభ్యంతరాలకు సంబంధించి ఫారమ్-5 ద్వారా సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు.అనంతరం సెప్టెంబరు 29, 30 తేదీలలో వెరిఫికేషన్ అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారని, విచారణ పూర్తయిన తర్వాత, సవరించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మహిళా ఓటర్ల తుది జాబితాను ఫారమ్-6 రూపంలో అక్టోబరు 1న అధికారికంగా ప్రచురించి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన కమిషనర్ ఠ డైరెక్టర్ కార్యాలయానికి సమర్పిస్తామని తెలిపారు. నగర ప్రజలందరూ తమ వివరాలను సరిచూసుకుంటూ ఈ సర్వే



ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.ఎన్నికల నిర్వహణపై కమిషనర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ లిస్టు మేరకు రిటర్నింగ్ అధికారులు వారి పరిధిలోని కేంద్రాల్లో నిర్దేశిత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మౌలిక వసతులను పరిశీలించి, ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటితో కలిపి నివేదిక ఇవ్వాలన్నారు. రిటర్నింగ్ అధికారులతో ఏఈలు సమన్వయం చేసుకోవాలని ఎస్ఈకి తెలిపారు. అలాగే వార్డ్ ల వారీగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను గుర్తించాలని, అవకాశం ఉన్న వరకు వార్డ్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా చూడాలన్నారు.బ్యాలెట్ బాక్స్ లను భద్ర పరచే కేంద్రాలను ఫైనల్ చేయాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ అందించేందుకు టెండర్ సిద్దం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, పిఓ, ఏపిఓలకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో డిప్యూటీ కమిషనర్ భాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల విభాగంతో ఇతర విభాగాలను డిప్యూటీ కమిషనర్ -2 చేయాలన్నారు. అన్ని విభాగాధిపతులు ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై వ్రాత పూర్వక నివేదికలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, డిప్యూటీ కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిటి ప్లానర్ డి.రాంబాబు, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఏఓ తిరుపతి నాయుడు, మేనేజర్ బాలాజీ బాష, ఎన్నికల విభాగ సూపరిండెంట్ పద్మ పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి నారా లోకేశ్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు

**అమరావతి, రాజధాని వాయిస్ :** విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి, విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాలు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణకు మిషన్ మోడ్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. దీనికోసం అవగాహన, సంస్థాగత మద్దతు, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం 'కేర్ ఏపీ' అనే టూల్‌ను సిద్ధం చేశామని, పైలట్ ప్రాజెక్టు కూడా పూర్తయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 963 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులకు 'హార్ట్‌ఫుల్ యోగా' శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సంస్థ ద్వారా 2,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నామని, ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో యోగా తరగతులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.పాఠశాల విద్యలో సంస్కరణల దశ ముగిసిందని, ఇకపై అధికారులంతా ఫలితాలపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని లోకేశ్ స్పష్టం చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. బోధనలో వెనుకబడిన ఉపాధ్యాయులకు మెంటార్ టీచర్లతో శిక్షణ



తప్పనిసరి చేయాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) అమలు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన 'అక్షర ఆంధ్ర' ద్వారా వచ్చే ఏడాది చివరికల్లా నూరు శాతం అక్షరాస్యత సాధించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షించిన మంత్రి, పీఎం సేతు పథకం కింద పారిశ్రామికవేత్తల సహకారంతో తొలి విడతగా 10 పారిశ్రామిక అనుసంధానిత ఐటీఐ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. స్టీల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఆక్వా, ఫార్మా రంగాల సంస్థలతో సంప్రదించి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గత రెండేళ్లలో జాబ్ మేళాల ద్వారా 1.72 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని, మొత్తం 5.43 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని అధికారులు వివరించారు. ఇకపై జాబ్ మేళాల నిర్వహణలో శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!

**అమరావతి, రాజధాని వాయిస్ :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెళ్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్



స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120-బి, 149 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది. 2024 అక్టోబర్ లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## మున్సిపల్ ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి - ఎమ్మెల్యే యరపతినేని



**గుంటూరు, రాజధాని వాయిస్ :** గురజాల: త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు నాయకులు,కార్యకర్తలు సిద్ధం కావాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.గురజాల పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి పార్టీ ముఖ్య నేతలు, క్లస్టర్, యూనిట్, వార్డు ఇన్‌చార్జీలతో విస్తృత స్థాయి క్యాడర్ మీట్ నిర్వహించారు.వార్డుల్లో బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసి, కార్యకర్తలను అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అందరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యరపతినేని నిఖిల్, పులుకూరి కాంతారావు, గురజాల మున్సిపల్ చైర్మన్ బడేజాని, కటికం అంకంరావు, అడపా శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి సెప్టెంబర్ 24న సీపీఐ సదస్సు!



**గుంటూరు, రాజధాని వాయిస్ :** :ఇల్లు లేని అర్హులైన నిరుపేదలకు సొంత ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుంటూరు నగర సమితి డిమాండ్ చేసింది. సెప్టెంబర్ 24వ తేదీ ఉదయం 10 గంటలకు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సొంత ఇల్లు లేని అర్హులైన నిరుపేదల కోసం ఇంటి స్థలాల అర్జీదారుల సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ తెలిపారు.బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. గుంటూరు నగర పరిధిలో సొంత ఇల్లు లేని అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయించడంతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు సొంత ఇల్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి స్థలం, గృహ నిర్మాణ సాయం అందే వరకు సీపీఐ ప్రజల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తుందని అరుణ్ కుమార్ స్పష్టం చేశారు.ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన నిరుపేదలు, సొంత ఇల్లు లేని కుటుంబాలు సెప్టెంబర్ 24న జరిగే సదస్సుకు హాజరై తమ సమస్యలను తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావే శంలో సీపీఐ గుంటూరు నగర కమిటీ సభ్యులు నూతలపాటి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శిక్షణ తరగతులు



**గుంటూరు, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గుంటూరు ఆర్య సమాజంలో జీవవైవిధ్యంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. జీవవైవిధ్య బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నంబర్ సెక్రెటరీ రామకృష్ణ, జోనల్ అధికారి చెన్నకేశవ నాయక్, భీమయ్య పాల్గొని సాంప్రదాయ వైద్యులకు జీవవైవిధ్యం, ఔషధ మొక్కల పరిరక్షణ తదితర అంశాలపై శిక్షణ అందించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో ప్రచురిస్తున్న 'అశ్విని గురుపరంపర' మాసపత్రికను పంపిణీ చేశారు. సాంప్రదాయ వైద్య విధానాలు, ఆయుర్వేదం, దేశీయ వైద్య విజ్ఞానానికి సంబంధించిన అంశాలను మాసపత్రిక ద్వారా ప్రచారం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ప్రధాన కార్యదర్శి నామాల శ్రీనివాసరావుతో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, దేశీయ వైద్యులు పాల్గొన్నారు.

## ఏపీ ఇంటర్ పరీక్ష ఫీజు తేదీల ప్రకటన

**గుంటూరు, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్‌లో 2027లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదల చేసింది. విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఈ గడువు తేదీలను గమనించి సకాలంలో ఫీజు చెల్లించాలని బోర్డు అధికారులు సూచించారు.విద్యామండలి వెల్లడించిన వివరాల ప్రకారం, ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సాధారణ ఫీజు చెల్లింపునకు 2026 సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 29 వరకు అవకాశం కల్పించారు. ఈ గడువులోగా ఫీజు చెల్లించని విద్యార్థులు, రూ. 1,000 ఆలస్య రుసుముతో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. **పరీక్ష ఫీజుల వివరాలు ఇలా ఉన్నాయి:** ప్రథమ లేదా ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలకు: రూ. 600 రెండు సంవత్సరాల థియరీ పరీక్షలకు కలిపి: రూ. 1,200 సీనియర్ ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు: రూ. 275 బ్రిడ్జ్ కోర్సుకు: రూ. 165 నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఫీజు చెల్లింపు తేదీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ప్రసక్తే లేదని ఇంటర్ విద్యామండలి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు

# ఇంటింటికీ టీడీపీ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం కజ్జం సైదయ్య

## 8వ వార్డులో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం



**మాచర్ల. సెప్టెంబర్ 23 రాజధాని వాయిస్ :**పట్టణంలోని 8వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 8వ వార్డు ఇన్‌చార్జ్ కజ్జం సైదయ్య, 8వ వార్డు అధ్యక్షుడు మద్దిగపు శ్రీనివాసు రెడ్డి (బుల్లి రెడ్డి), 8వ వార్డు ఉపాధ్యక్షుడు వంకాయలపాటి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా 67వ బూత్ ఇన్‌చార్జ్ రాజీవ్ కుమార్ వంకాయలపాటి మాట్లాడుతూ, వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, ఆయా పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పెన్షన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు.అలాగే మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. వార్డులోని ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.వార్డులో తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వార్డులో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాజీవ్ కుమార్ వంకాయలపాటి తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ పీట్ల బాబు, చల్లా సాంబ, చల్లా రాజారత్నం, వంకాయలపాటి కోటేశ్వరరావు, బత్తుల పిచ్చయ్య, నరేష్ ఓర్సు, మంజుల శ్యాంబాబుతో పాటు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెగ్యులర్ చేయాలంటూ కాంట్రాక్ట్ నర్సుల కొవ్వొత్తుల ర్యాలీ




**మాచర్ల.సెప్టెంబర్ 23 రాజధాని వాయిస్ :** ఏళ్ల తరబడి సేవలందిస్తున్న కాంట్రాక్ట్ నర్సులను వెంటనే రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మాచర్లలో కాంట్రాక్ట్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 14 వేల మంది, మాచర్ల నియోజకవర్గంలో 58 మంది కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన తమ సర్వీసును గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని నినదించారు. అర్హతలు, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్సులు శివరంజని, అన్నమేరి, మల్లేశ్వరి, కామేశ్వరి, శకుంతల, శ్రీలత, పారామెడికల్ సిబ్బంది కళ్యాణ్, కృష్ణా రెడ్డి, అరుణ, సుమా, టెక్నీషియన్లు రాంబాబు, బేగం తదితరులు పాల్గొన్నారు.

# పొడా అనుమతులు ఉన్న లేఅవుట్లనే కొనుగోలు చేయాలి

## - సంయుక్త కలెక్టర్ సంజనా శ్రీహర్ష



**నరసరావుపేట.సెప్టెంబర్ 23, రాజధాని వాయిస్ :** పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పొడా పరిధిలోని పంచాయతీ లలో అనధికార లే అవుట్ల లోని ఫ్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయరాదని, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వరాదని సంబంధిత అధికారులను సంయుక్త కలెక్టర్ మరియు పొడా వైస్ చైర్మన్ సంజన శ్రీ హర్ష ఆదేశించారు. కలెక్టరేట్లోని వీడియో సమావేశ మందిరంలో పౌడ అధికారులు, రియల్ ఎస్టేట్ డెవలపర్స్ మరియు లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, జిల్లా పంచాయతీ అధికారి ,జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, విద్యుత్ శాఖ అధికారులతో అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని పంచాయతీ ప్రాంతాలలో అనధికార లేఅవుట్ల పై అనధికార భవన నిర్మాణాలను నియంత్రించడం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అనధికార లేవట్లను గుర్తించడం జరిగిందని, రావిపాడు, గుంటగార్లపాడు, ములకలూరు రెవిన్యూ గ్రామాలలో 9 లేఔట్ ల ను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ,పౌడ అనుమతులు లేకుండా వేసిన అనధికార లేఔట్లలోని ఫ్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయవద్దని జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించడం జరిగిందని, ఏపీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ శాఖ అధికారులను విద్యుత్ కనెక్షన్లు ఇవ్వరాదని,ఈ నిబంధన అనధికార లేఔట్లుకు మాత్రమే వర్తిస్తుందని వ్యవసాయ భూములకు వర్తించదన్నారు. నెల్లూరు, ఒంగోలు జిల్లాలలో అనధికార లేఅవుట్లను, కట్టిన బిల్డింగ్ ల ను కూల్చివేయడం జరిగిందని ఎల్ఎస్ఆర్లో అప్లై చేసుకోని వాటిని కూల్చివేసినట్లు తెలియజేశారు. డెవలపర్లు ఒక ఎకరానికి 10 శాతం ఓపెనింగ్ ప్లేస్ ఉంచాలనీ, ఎక్సర్నల్ డెవలప్మెంట్ చార్జెస్ రిజిస్ట్రేషన్ చార్జీలో నాలుగు శాతం కట్టాల్సి ఉందని, సైట్ ఏరియాలో లేఅవుట్ పర్మిట్ ఫీజు ఫర్ స్వేర్ మీటర్స్ కి మూడు రూపాయలు, ఖాళీ ప్రదేశం డెవలప్మెంట్ కు పది చొప్పున, పేపర్ పబ్లికేషన్ కు, యూజర్ చార్జీలకు కలిపి ఒక ఎకరానికి సుమారు 1,80 వేలు లు చెల్లించవలసి ఉంటుందని తెలియజేశారు.డెవలపర్స్ తమ వెంచర్లకు పౌడా అనుమతులు పొందాలని సూచించారు.కావున ప్రజలు ఎవరు అనధికార లేఔట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని, భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణాల అనుమతులు ఇతర సదుపాయాలు పొందలేరని, లేఅవుట్ అనుమతులు పరిశీలించిన తర్వాతే ఫ్లాట్లు కొనుగోలు చేయాలని కోరారు.

# అమరావతి పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా షేక్ మున్నీర్ నియామకం



**పెదకూరపాడు.సెప్టెంబర్ 23 రాజధాని వాయిస్ :**అమరావతి పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా షేక్ మున్నీర్‌ను నియమిస్తూ పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాచర్ల–సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త అయిన మున్నీర్ ఇటీవల తెలుగుదేశం పార్టీని వీడి అమరావతి పార్టీలో చేరారు.పార్టీ బలోపేతానికి మున్నీర్ నియామకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంటూ శివారెడ్డి హర్షం వ్యక్తం చేయగా, నూతన ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన మున్నీర్‌కు పలువురు నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలి



**అమరావతి.సెప్టెంబరు 23రాజధాని వాయిస్ :** ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, క్షేత్రస్థాయి ముందస్తు చర్యలపై బుధవారం ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల ఎస్ఈలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.గతంలో భారీ వర్షాలు, ఈదురుగాలులకు స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా లోతట్టు, తీర ప్రాంతాలు, తరచూ సమస్యలు వచ్చే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన సిబ్బంది, వాహనాలు, పరికరాలు, అదనపు స్తంభాలను సిద్ధంగా ఉంచడంతో పాటు అత్యవసర ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి పర్యవేక్షించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.

# వృత్తి విద్యా విద్యార్థుల పారిశ్రామిక సందర్శన







**దుర్గి.సెప్టెంబరు 23 రాజధాని వాయిస్ :** విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు, ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు పారిశ్రామిక సందర్శన కార్యక్రమం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ద్వారా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆటోమోటివ్ విభాగానికి చెందిన విద్యార్థులు ఓబులేసునిపల్లె లోని యగంటి ఎపిక్ క్రాఫ్ సైన్సెస్ సంస్థను, ఐటీ విభాగానికి చెందిన విద్యార్థులు దుర్గిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీబీ) శాఖను సందర్శించారు. పరిశ్రమలలో అనుసరించే ఆధునిక సాంకేతిక విధానాలు, ఉత్పత్తి పద్ధతులతో పాటు బ్యాంకులో డిజిటల్ లావాదేవీలు, కంప్యూటర్ ఆధారిత బ్యాంకింగ్ సేవల తీరును విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించి అవగాహన చేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కె.ఎం. రెహమాన్ మాట్లాడుతూ, పుస్తకాల్లోని విజ్ఞానాన్ని ఆచరణాత్మక నైపుణ్యంగా, ఆ నైపుణ్యాన్ని ఉపాధిగా మార్చుకోవడానికి వృత్తి విద్య ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలు, పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సీఎం సానుకూలం మంత్రి నారాయణ



**విజయవాడ. సెప్టెంబర్ 23 రాజధాని వాయిస్ :**అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌ను త్వరితగతిన పరిష్కరించే దిశగా సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. బుధవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంత్రిని కలిసి, గతంలో విడుదలైన జీవో నెం.107 అమలు, న్యాయ నిపుణుల అభిప్రాయాలను వివరించారు. దీనిపై సీఆర్‌డీఏ కమిషనర్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శితో వెంటనే మాట్లాడి తగిన కార్యాచరణ చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. తమది జర్నలిస్టు స్నేహపూర్వక ప్రభుత్వమని, రాజధాని నిర్మాణంలో మీడియా భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.మంత్రిని కలిసిన వారిలో సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి చావా రవి, ది పయనీర్ బ్యూరో చీఫ్ డాక్టర్ రవి కుమార్ బొప్పన, ది హిందూ డిప్యూటీ ఎడిటర్ టి. శ్రీనాథ్, హన్స్ ఇండియా రెసిడెంట్ ఎడిటర్ శ్యామ్ సుందర్, ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్ ఎన్. గోపి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రెసిడెంట్ ఎడిటర్ మల్లేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు కృష్ణారావు, రామకృష్ణ (ఢిల్లీ) తదితరులు ఉన్నారు.

# పామాయిల్ సాగుతో రైతులకు అధిక లబ్ధి కలెక్టర్ వినోద్ కుమార్



**భట్టిప్రోలు.సెప్టెంబర్ 23 రాజధాని వాయిస్ :** పామాయిల్ సాగుతో రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. బుధవారం ఆయన పెద్దపులివర్రు గ్రామంలో రైతు నాదెండ్ల రామకోటేశ్వరరావు ఆరు ఎకరాల్లో సాగు చేస్తున్న పామాయిల్ తోటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎల్నినో ప్రభావంతో నష్టం వాటిల్లకుండా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. హెక్టారుకు రూ.15,000 విలువైన మొక్కలను ప్రభుత్వమే ఉచితంగా అందించిందని, అంతర పంటలకూ ప్రోత్సాహం ఇస్తోందని రైతు వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం తెచ్చే ఈ పంటలో ఐదేళ్ల తర్వాత ఎకరాకు 6 నుంచి 8 టన్నులు, ఆపై క్రమంగా 14 టన్నుల వరకు దిగుబడి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 186 హెక్టార్లలో ఉన్న సాగును 550 ఎకరాలకు విస్తరించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. అంతర పంటల సాగుకు ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో శ్రీదేవి, ఉద్యానవన శాఖ అధికారి ఖలీల్, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

## బాపట్ల కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**బాపట్ల.సెప్టెంబర్ 23 రాజధాని వాయిస్ :** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం దరఖాస్తులను అధికారులు వేగంగా పరిశీలించి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. బుధవారం భట్టిప్రోలు ఎంపీడీవో కార్యాలయం నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇంకా 12,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంపై ఆరా తీసిన కలెక్టర్, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా బాధ్యతగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా చేనేత కార్మికులవి 443, మత్స్యకారులవి 980, డప్పు కళాకారులవి 749, వృద్ధాప్య పింఛన్లు 1,034, కల్లు గీత కార్మికులవి 740, ఒంటరి మహిళలవి 120, ఇతర దరఖాస్తులు 5 పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, రేపల్లె, నగరం, బాపట్ల మండలాల్లో పెండింగ్ ఎక్కువగా ఉన్నందున వెంటనే పరిశీలించాలని స్పష్టం చేశారు. అన్ని పంచాయతీలలో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమాలను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని, డీపీవో, డివిజనల్ పంచాయతీ అధికారులు (డీఎల్‌డీవో) ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాల హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు పంటల బీమా సౌకర్యం దక్కేలా ఈ–క్రాప్ బుకింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వర్షాల వల్ల ప్రజలకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులు, మురుగు కాలువల పూడికతీత చేపట్టాలన్నారు. పామాయిల్ సాగు లాభసాటిగా ఉన్నందున రైతులను చైతన్యపరిచి విస్తృతంగా సాగయ్యేలా ఉద్యానవన శాఖ అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, ఆర్డీవో శ్రీదేవి, భట్టిప్రోలు ఎంపీడీవో వెంకటరమణతో పాటు పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనే రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ లక్ష్యం



**గుంటూరు.సెప్టెంబర్ 23రాజధాని వాయిస్ :**ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలు కోసం ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేస్తామని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పల్నాడు, గుంటూరు జిల్లాల అధ్యక్షులు ఆర్.కె. నాయుడు, శిఖా నాగమణి స్పష్టం చేశారు. బుధవారం గుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని, రాష్ట్ర హక్కుల సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాతోనే పరిశ్రమలు, యువతకు ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ అంశాలపై పోరాటం ఉధృతం చేస్తామని, గ్రామ స్థాయి నుంచి ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని తెలిపారు. పార్టీలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని, రాబోయే స్థానిక సంస్థలతో పాటు సార్వత్రిక ఎన్నికల్లోనూ పోటీకి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, నాగిరెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com